క్లుప్తంగా

జాతీయ పోటీలకు రాయవరం విద్యార్థిని ఎంపిక



గూడూరు: అండర్–17 జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గూడూరు మండలం రాయవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నందం నాగసిరి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.ఎం.సౌజన్యకుమారి తెలిపారు. గత నెల 23 నుంచి 25 వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నందం నాగసిరితో పాటుగా కోలపల్లి నిఖిత, విట్టంశెట్టి అనూశ్రీలు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన నాగసిరి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. విద్యార్థిని నాగసిరిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.గోవిందరాజును పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. 2.60 లక్షల విరాళం



మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి నిత్యాన్నదానానికి తోట్లవల్లూరు మండలం వల్లూరిపాలెంకు చెందిన భక్తులు బండి సాయి గణేష్‌కృష్ణ, తేజస్విని దంపతులు రూ. 2.60లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం ఉదయం స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. దాతలకు స్వామివారి లడ్డు ప్రసాదంతో పాటు ఉత్తరీణీ అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు, ఆలయ అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సాయం



మచిలీపట్నంటౌన్: 34వ డివిజన్‌లో ఇటీవల మృతిచెందిన బందికోళ్ల వసంతకుమారి కుటుంబ సభ్యులకు ఆ డివిజన్‌లోని సామాజిక పెన్షనర్లు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పింఛను సొమ్ములో నుంచి ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించగా వచ్చిన రూ. 27,900 లను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ బడే భానుతేజ సమక్షంలో అందజేశారు. భానుతేజ మాట్లాడుతూ సాయం చేసిన పెన్షనర్లను అభినందించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ సుంకర రాఘవరావు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌లో హృద్రోగంతో బాధపడుతున్న మొహమ్మద్ సర్దార్ షరీఫ్‌కు రూ. 1.75 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అందజేశారు. షరీఫ్ ఇంటికి వెళ్లి ఈ చెక్కును మునిసిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదాతో కలిసి ఆయన అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ హృద్రోగంతో బాధపడుతున్న సర్దార్ షరీఫ్‌కు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సిఫార్సు చేసిన వెంటనే నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాకోళపు నరసింహగుప్తా, షేక్ మొహమ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పనులను సులభతరం చేసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. అమరావతి సచివాలయం నుంచి గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. పాఠశాల విద్య, స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాకు సంబంధించిన అంశాలను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు సక్రమంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ యాప్‌ల రూపంలో విధులు కేటాయిస్తోందన్నారు. అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పనిని సులభంగా చేసుకోవాలని చెప్పారు. వీటిపై అధికారులు వా రి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రతి అంశంలోనూ యాప్‌లు లేదా ఆన్‌లైన్ ద్వారా సేకరించే డేటాను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, అనీమియా బాధితుల గుర్తింపు వంటి అంశాలపై డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా, అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. బడిలో చేరని, చదువు మధ్యలో మానేసిన ఆరు నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పాఠశాలల్లో చేర్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ ముఖ ఆధారిత హాజరు కచ్చితంగా వేసేలా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాల న్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరును నిత్యం పర్యవేక్షించాలని, గైర్హాజరవుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ గీతాబాయి, డీఎల్‌డీఓ సుబ్బారావు, సీపీఓ వై శ్రీలత, డీఈఓ తాహెరా సుల్తానా, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం 79 శాతం పూర్తి

కృష్ణా జిల్లాలో ఓటరు కార్డుతో ఆధార్‌కార్డు అనుసంధానం ప్రక్రియ 79 శాతం పూర్తయిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై సమీక్షించారు. కృష్ణా జిల్లాలో ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం 79 శాతం పూర్తి చేయడంతో పాటు ఫారం–6, 7, 8లలో కనబరిచిన పనితీరుకు కలెక్టర్‌ను సీఈఓ అభినందించారు. జిల్లాలో కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం–6 ఉపయోగించాలని, నకిలీ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వెళ్లిన వారు, కొత్తగా వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, పునరావృతమైన పేర్లు తొలగింపునకు ఫారం –7, మార్పుల కోసం ఫారం–8ను ఉపయోగిస్తూ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ.కిషోర్, పి.పద్మావతి, విజయకుమార్, ఎంయూడీఏ వీసీ నారాయణరెడ్డి, డీఎస్‌ఓ వి.పార్వతి పాల్గొన్నారు.

ఎదురుమొండి వంతెనపై అసత్య ప్రచారం

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఎల్లో మీడియా అబద్ధపు కథనాలపై ఆగ్రహం
- సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోనే వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టీకరణ

నాగాయలంక(అవనిగడ్డ): ఎదురుమొండి వంతెన నిర్మాణం విషయంలో తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా విషం చిమ్ముతూ అబద్ధపు కథనాలను వండి వార్చుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. ఈ తప్పుడు కథనాలను నియోజకవర్గం ప్రజలు నమ్మబోరని స్పష్టంచేశారు. నాబార్డు నిధుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎదురుమొండి వద్ద చేపట్టనున్న హైలెవల్ వంతెనకు సంబంధించి ఏటిమొగ వంటు ప్లాట్‌ఫాం వైపు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న మట్టి పరీక్ష (సాయిల్ టెస్ట్)లను అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ.. దీవుల ప్రజల్లో ఆందోళన కలిగించే లక్ష్యంతో పచ్చ పత్రిక తప్పుడు కథనాలతో విషం చిమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఎదురుమొండి వారధి కోసం ఏఐడీబీ ద్వారా నిధులు మంజూరు చేశారని, తదిపరి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీరుతో వంతెన చేపట్టలేదంటూ ఆ పత్రిక విషం కక్కిందని ధ్వజమెత్తారు. ఎదురుమొండి వంతెన చేపట్టాలనే డిమాండ్‌తో దీవుల ప్రజలతో కలిసి గత ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ నాగాయలంకలో దీక్షలు చేయడాన్ని టీడీపీ, ఆ పచ్చ మీడియా మర్చిపోయినా ప్రజలకు గుర్తుందని పేర్కొన్నారు. అసలు నిధులు మంజూరయితే దీక్షలు ఎందుకు చేశారనే ఇంగిత జ్ఞానం కూడా అవాస్తవ కథనాలు వండివార్చే వారికి లేకపోవడం



మట్టి నమూనా పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

దురదృష్టకరమన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ.. నాగాయలంక మండలంలో ఎదురుమొండి వంతెన నిర్మాణానికి ఒక పక్క మట్టి పరీక్షలు జరుగుతుంటే, మరోవైపు తప్పుడు రాతలతో అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, జెడ్పీటీసీ మాజీసభ్యుడు కన్నా నాగరాజు మాట్లాడుతూ.. దీవుల ప్రజల అభివృద్ధిని నిరోధించేలా పచ్చ మీడియా కథనాలు రాయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. తొలుత ఎదురుమొండి వంతెనకు సంబంధించి ఏటిమొగ వైపు జరుగుతున్న మట్టిన నమూనా, భూపరీక్షలను ఎమ్మెల్యే సింహాద్రి పరిశీలించారు. ఆర్అండ్‌బీ డీఈఈ జి.వరలక్ష్మి, ఏఈఈ ఎం.రమేష్, పనులు చేపట్టిన కన్సల్టెన్సీ ఆర్వీ అసోసియేట్స్ సైట్ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్, తహసీల్దార్ జె.వి మలకుమారి, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, తోట సాయిబాబు, నంద్యాల వెంకట కోటేశ్వరరావు, నాయుడు అంకరాజు, చెన్ను వెంకటేశ్వరరావు, సైకం వసంతరావు, తోట సాయిబాబు, నంద్యాల వెంకట కోటేశ్వరరావు, చెన్ను నాగపుష్పారావు పాల్గొన్నారు.

రెండు మండలాలకు క్యాబినెట్ ఆమోదం

ఉత్తర, దక్షిణ మండలాల ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు



ప్రతిపాదిత మండలాలకు సంబంధించిన మ్యాప్

చిలకలపూడి(మచిలీపట్నం): ఇప్పటి వరకు ఒక్క మండలంగా ఉన్న మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండు మండలాలుగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నియోజకవర్గంలో ప్రస్తుతం 28 రెవెన్యూ గ్రామాలు, కార్పొరేషన్‌లోని 50 డివిజన్లకు సంబంధించి ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉంది. ప్రజల సౌకర్యార్థం, పరిపాలనా సౌలభ్యం కోసం రెండు మండలాలుగా విభజించి సేవలు అందించేందుకు అడుగు పడింది. ఈ మార్గంలో ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపారు.

ఉత్తర మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు, 30 డివిజన్లు..

బందరు ఉత్తర మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు, 1 నుంచి 19 డివిజన్లు, 40 నుంచి 50 డివిజన్లు ఉంటాయి. పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, గోకవరం, మంగినపూడి, బుద్దాలపాలెం, తవిసిపూడి, కొత్తపూడి, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, పోతేపల్లి, గోపువానిపాలెం, అరిసేపల్లి, హుస్సేన్‌పాలెం, కరగ్రహారం, మాచవరం, చిలకలపూడి గ్రామాలు ఉత్తర మండలంలో ఉన్నాయి. మచిలీపట్నం కార్పొరేషన్‌లో ఒకటి నుంచి 19 వరకు 40 నుంచి 50 వరకు డివిజన్లు ఉన్నాయి. ఈ మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,39,578 మంది జనాభా ఉన్నారు. ఈ మండలానికి హద్దులుగా తూర్పున బంగాళాఖాతం, పడమరగా పెడన, బంటుమిల్లి మండలాలు, ఉత్తరంలో కృత్తివెన్ను మండలం, దక్షిణంలో ఎస్.ఎన్. గొల్లపాలెం, మునిసిపల్ డివిజన్లు ఉన్నాయి.

దక్షిణ మండలంలో 11 రెవెన్యూ గ్రామాలు, 20 డివిజన్లు..

బందరు దక్షిణ మండలంలో 11 రెవెన్యూ గ్రామాలు, 20 నుంచి 39 డివిజన్లు ఉంటాయి. బందరు రూరల్, ఎస్.ఎన్. గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, పి.టి.పాలెం, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు గ్రామాలు ఉన్నాయి. అలాగే మచిలీపట్నం కార్పొరేషన్‌లో 20 నుంచి 39 డివిజన్లు ఉన్నాయి. ఈ మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 99,384 మంది జనాభా ఉన్నారు. ఈ మండలానికి సంబంధించి హద్దులుగా తూర్పున బంగాళాఖాతం, పడమరగా చల్లపల్లి మండలం, ఉత్తరంలో బందరు ఉత్తర మండలం, దక్షిణంలో కృష్ణానది (కోడూరు మండలం వద్ద) ఉన్నాయి.

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ గీతాబాయి

కోనేరుసెంటర్: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. బందరు మండలం తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడారు. ప్రతి నెలా 9, 10 తేదీలలో ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెండు, మూడు త్రైమాసికలో గల గర్భిణిలకు అవసరమైన అన్ని పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు సంబంధించి హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపు, ఆర్‌సీహెచ్ టైపింగ్, హెచ్ఐవీ, బ్లీడింగ్, క్లాటింగ్‌టైం, యూరిన్, ఆల్బమిన్ పరీక్షలను నిర్వహించాలని చెప్పారు. ఆ సమాచారాన్ని ఆర్‌సీహెచ్ పోర్టల్, ఎంసీపీ కార్డులలో అప్‌డేట్ చేయాలన్నారు. గర్భిణులకు తగిన వైద్య సేవలు, సలహాలు అందజేయాలన్నారు. రక్తహీనత నివారణ చర్యలు, పోషకాహారం సేవలు అందించాలని చెప్పారు. మొదటిసారి గర్భం దాల్చిన వారి వివరాలు నమోదు చేసిన వెంటనే పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ప్రసవించిన బిడ్డకు పుట్టిన వెంటనే వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని చెప్పారు. తద్వారా మాతా శిశు మరణాలు జీరోకు తీసుకువచ్చేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి

ఆన్‌లైన్ ద్వారా ప్లాన్ల జారీ ఉపయోగకరం

ఎంయూడీఏ చైర్‌పర్సన్ దుర్గాభవాని

మచిలీపట్నంటౌన్: ఆన్‌లైన్‌ద్వారా గృహ నిర్మాణాల ప్లాన్ల జారీ ప్రక్రియ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని అన్నారు. గురువారం ఎంయూడీఏ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ప్లాన్ల జారీ విధానంపై ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంయూడీఏ పరిధిలోని 13 మండలాలకు చెందిన ఈ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుర్గాభవాని మాట్లాడుతూ ప్రస్తుతం ఎంయూడీఏ ఆధ్వర్యంలో ఇంటి ప్లాన్లను మాన్యువల్‌గా ఇస్తున్నారని, దీనివల్ల ప్లాన్ మంజూరుకు కనీసం నెలరోజులు పడుతోందన్నారు. ఈ జాప్యాన్ని నివారించాలనే ఉద్దేశంతో ఎంయూడీఏ ఆధ్వర్యంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయించామన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్లాన్‌కు దరఖాస్తు చేసిన వారం రోజుల్లోగానే మంజూరు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఎంయూడీఏ వీసీ నారాయణరెడ్డి, ఎంయూడీఏ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం



స్వామివారి శాంతి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామంలోని పార్వతి సమేత అగస్తేశ్వరస్వామి వారి ఎనిమిదో వార్షికోత్సవ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మ వారికి కుంకుమ పూజలు పండితులు సోమశేఖరపల్లి ఈశ్వరశర్మ శిష్యబృందం ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి వేషాలతో మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా నాగబాబు, కార్యదర్శి లక్కాప్రగడ మాధవరావు, జల్లూరి శరభయ్యగుప్తా దంపతులు పాల్గొన్నారు.

సద్దుమణిగిన పైప్‌లైన్ వివాదం

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో పైపులైన్ వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. గురువారం స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో పలు పార్టీల నాయకులు పాల్గొని సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. ఇంటింటికి తాగునీరు సరఫరా చేసేందుకు జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో పైపులైన్ నిర్మాణానికి రూ. 48 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలువురు నాయకులు రెచ్చగొట్టి వివాదానికి తెరలేపారు. సుమారు 40 ఏళ్ల కిందట భూమిలో నాలుగు అంగుళాల పైప్‌లైన్ వేసి ట్యాంకు నుంచి నీరు విడుదల చేస్తున్నారు. ఈ నీరు తాగడానికి పనికిరాకపోయినా గృహావసరాలు, పశువులకు ఉపయోగించుకుంటున్నారు. జేజేఎం పథకంలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరాకు ప్రభుత్వం మూడు అంగుళాల పైప్‌లైన్‌కు అనుమతులు ఇచ్చింది. ఈ పైప్‌లైన్ మారితే నీరు పూర్తిగా రాదని, ఇబ్బందులు పడతారాంటూ నాయకులు మహిళలను రెచ్చగొట్టి వివాదానికి తెరలేపారు. దీంతో మా వీధుల్లో పైపులు వేయడానికి వీలు లేదని మహిళలు రోడ్డెక్కడంతో అధికారులు పనులు నిలిపివేశారు. మహిళలు తాగునీరు వద్దు, వాడకం నీరు సరిపడా కావాలి అంటూ డిమాండ్ చేశారు. మంచినీరు కొనుక్కుంటాం, వీధి కుళాయిలు వేసుకోండి అన్నారు. ఈ క్రమంలో గ్రామ సభ నిర్వహించి పాత, కొత్త పైపులైన్ల ద్వారా రెండు రకాల నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈఈ నాగేశ్వరరావు హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. సమావేశంలో పంచాయతీ ప్రత్యేక ఆహ్వానితులు సీహెచ్ మాణిక్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు బి. సత్యనారాయణ, పి. బాబ్జీ, ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతులకు చర్యలు

- ఎమ్మెల్యే పేర్ని నాని
- పోతిరెడ్డిపాలెం జగనన్న కాలనీ సందర్శన



అధికారులతో చర్చిస్తున్న పేర్ని నాని

కోనేరుసెంటర్: జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బందరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కాలనీకి వెళ్లేందుకు ప్రధాన రహదారి అవసరమని పోతేపల్లి మాజీ ఎంపీటీసీ పిప్పళ్ల నాగబాబు పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కాలనీలో ఇప్పటికే గృహాలు నిర్మించుకున్న పలు కుటుంబాలకు రోజు విడిచి రోజు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడిన ఆయన యుద్ధప్రాతిపదికన కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. గృహాలు నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సదుపాయాల కల్పనకు అవసరమైన నిధుల నివేదికను వెంటనే తయారు చేయాలని పేర్ని నాని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జీవీ సూర్యనారాయణ, ఎంపీడీఓ బాలకృష్ణారావు, పంచాయతీ డీఈ తోట లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, పంచాయతీ సెక్రటరీ నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం షాపుల నిర్వహణకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు, అధికారులు

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో వివిధ షాపుల నిర్వహణ హక్కునకు జరిగిన బహిరంగ వేలం పాటలో ఐదు షాపులకు వేలం పూర్తయిందని ఆలయ ఏసీ ఎన్ ఎస్ చక్రధరరావు తెలిపారు. మోపిదేవి ఆలయ ప్రాంగణంలో గురువారం షాపుల ఇ– ప్రొక్యూర్‌మెంట్ టెండర్ కం– బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఏసీ మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 సంవత్సర కాలపరిమితికి లైసెన్సు హక్కునకు గాను షాపు నెంబర్ 2, (టీటీడీ కల్యాణ మండపం) సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు విక్రయించుకొను లైసెన్సు హక్కునకు వి. శివరామకృష్ణ రూ. 8,65,000లకు పాడి కైవసం చేసుకున్నారని చెప్పారు. భక్తుల పాదరక్షలు భద్రపరచి రుసుం వసూలు చేసుకొను లైసెన్సు హక్కునకు ఎస్. పార్వతి రూ. 6,03,000, భక్తుల సామాన్లు భద్రపరుచు కొనుటకు క్లోక్ రూం నిర్వహణ లైసెన్సు హక్కు పి. శ్రీనివాసరావు రూ. 7,03,000, భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు పోగుచేసుకొను హక్కు జి. చిన్నరాజు రూ. 5,04,000, సీసీ కెమేరాలు పర్యవేక్షణ, రిపేర్లు చేయుటకు సీల్డ్ టెండర్ కేదార్‌నాథ్ రూ. 1,49,000 హెచ్చు పాటగా పాడినట్లు తెలిపారు. మిగిలిన పాటలను ధరావతుదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని ఆలయ ఏసీ చక్రధరరావు వివరించారు. ఆలయ అధికారులు, పాటదారులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

పెడన మున్సిపల్ కమిషనర్ అంజయ్య



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

పెడన: ఓటుకు ఆధార్ నెంబర్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య బూత్ లెవల్(బీఎల్ఓలు) అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కమిషనర్ తన చాంబర్‌లో పట్టణానికి చెందిన బీఎల్‌ఓలతో 6(బి)పై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో 70 శాతం నుంచి 80 శాతంలోపు చేసిన వారు తమ పనిని మరింత వేగవంతం చేయాలన్నారు. మిగిలిన వారు కూడా వంద శాతం పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. వెనుకబడితే ఎన్నికల సంఘం శాఖాపరంగా తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. త్వరితగతిన అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీపీఓ ఏసుబాబు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



ప్రధానోపాధ్యాయిని జ్యోతితో మాట్లాడుతున్న సురేష్ రంగబాబు

గూడూరు: రానున్న పదో తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు ఎంతమంది హాజరవుతున్నారని, వారికి ఎలాంటి శిక్షణ ఇస్తున్నారని ప్రధానోపాధ్యాయిని ఎం.జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 69 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతారని ఆమె చెప్పారు. అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మూమెంట్ రిజిస్టర్లను జెడ్పీటీసీ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ యక్కల మాధవి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, రామకోటి పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

గూడూరు: జగనన్న పచ్చతోరణంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని డ్వామా ఏపీడీ శ్రీలత అన్నారు. గురువారం గూడూరులో పర్యటించిన ఆమె జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో నాటిన మొక్కలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 400 మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నాటిన ప్రతి మొక్కకు నీరు పోయడమే కాకుండా ట్రీ గార్డులు ఏర్పాటు చేసి సంరక్షించాలన్నారు. సర్పంచ్ లింగం సులోచనారాణి, లింగం విజయ్‌కుమార్, ఉపాధి హామీ పథకం సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.